సాక్షి గుంటూరు

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



ఘనంగా అంకాలమ్మ బోనాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో అంకాలమ్మ బోనాలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.



నూకాలమ్మకు కుంకుమార్చన

చెరుకుపల్లి: శ్రావణమాసం పురస్కరించుకుని గుళ్లపల్లిలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం సామూహిక కుంకుమార్చన అంగరంగ వైభవంగా నిర్వహించారు.

మహాలక్ష్మిగా చందోలు బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో కొలువైఉన్న బండ్లమ్మ దేవాలయంలో శ్రావణ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా అమ్మవారిని మహాలక్ష్మి స్వరూపంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

గుంటూరు ఎడ్యుకేషన్: భారీ వర్షాల దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదివారం తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు ఆర్ఐవో జీకే జుబేర్ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి తరగతులు నిర్వహించరాదని ఆయన స్పష్టం చేశారు.

నేడు,రేపు పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సోమవారం పలు రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. రైలు నంబర్ 07464 (విజయవాడ-గుంటూరు), 07465 (గుంటూరు-విజయవాడ), 07755 (డోర్నకల్-విజయవాడ), 07756 (విజయవాడ-డోర్నకల్), 17201 (గుంటూరు-సికింద్రాబాద్) 17202 (సికింద్రాబాద్-గుంటూరు), 12705 (గుంటూరు-సికింద్రాబాద్), 12706 (సికింద్రాబాద్-గుంటూరు), ధర్మవరం-మచిలీపట్నం(17216), లింగంపల్లి-నరసాపూర్ (17256) సోమవారం రద్దు చేశారు. విజయవాడ-గుంటూరు(07783), గుంటూరు-విజయవాడ(07779), మాచర్ల-నడికుడి (07580), నడికుడి-మాచర్ల(07579), మాచర్ల-గుంటూరు(07780),గుంటూరు-విజయవాడ(07788), కాచిగూడ-మిర్యాలగూడ (07276),మిర్యాలగూడ-నడికుడి(07277), నడికుడి-మిర్యాలగూడ(07973), మిర్యాలగూడ-నడికుడి(07974) రైళ్లను సోమ, మంగళవారాలలో రద్దు చేసినట్లు తెలిపారు.

వీఆర్‌కు పట్టాభిపురం ఎస్‌హెచ్‌వో కిరణ్

పట్నంబజారు: గుంటూరు వెస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని పట్టాభిపురం పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో పి.కిరణ్‌ను వీఆర్‌కు పంపుతూ పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల జరిగిన సివిల్ వివాదంలో ఆయన ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతోపాటు కమ్మా వెంకట్రావు, ఆయన కుమారుడు హరికృష్ణలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. బాధితులు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఎస్‌హెచ్‌వో కిరణ్‌ను వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ అయ్యాయి.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

గుంటూరు వెస్ట్: ప్రతి సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను భారీ వర్షాల కారణంగా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. సోమవారం జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామని, ప్రజలు గమనించాలని అధికారులు తెలిపారు. స్థానికంగా ఉండే ఇబ్బందులను గ్రామ, వార్డు సచివాలయాల్లో తెలియజేయాలన్నారు. భారీ వర్షాల కారణంగా ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు కలెక్టరేట్‌లోని టోల్ ఫ్రీ నెంబర్ 0863- 2234014తోపాటు మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

కృష్ణాకు భారీగా వరద నీరు



తాడేపల్లిరూరల్: కృష్ణా ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరడంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద ఆదివారం కూడా ఇరిగేషన్ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో గేట్లు ఎత్తి దిగువకు పంపారు. మధ్యాహ్నం మూడు గంటలకు బ్యారేజ్ వద్ద 9 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరింది. కృష్ణా నది ఎగువ ప్రాంతంలోని పలు గెస్ట్‌హౌస్‌ల్లోకి వరదనీరు చొచ్చుకు వచ్చింది. ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి కొండవీటివాగు ఎక్స్‌క్లూయిస్ వద్దకు వరద నీరు చేరడంతో మత్స్యకారులు పడవలను రేవుపైన భద్రపర్చుకున్నారు. దిగువ ప్రాంతంలో పుష్కర ఘాట్ల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వరద ఉధృతి పెరగడంతో మత్స్యకారులు పడవలను పుష్కరఘాట్లపై భద్రపరుచుకున్నారు. మహానాడు మసీదు రోడ్డులో నివాసాలను ఆనుకుని కృష్ణానది ప్రవహిస్తోంది. ఎంటీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు తాడేపల్లి తహసీల్దార్ సతీష్‌కుమార్ తన బృందంతో అక్కడకు చేరుకుని నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గుడిమెడ వద్ద పొలాల్లోకి నీరు చొచ్చుకు వచ్చింది.

వాన.. హైరానా

వర్షపు నీటిలో మంగళగిరి టిడ్కో గృహాలు



ఆకాశానికి చిల్లు

- జిల్లావ్యాప్తంగా ఎడతెరపిలేని వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- గుంటూరు నగరాన్ని ముంచెత్తిన వర్షం
- పలుచోట్ల నిలిచిన రాకపోకలు
- కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం
- అత్యధికంగా గుంటూరు తూర్పులో 256 మి.మీ. వర్షం
- సగటున 155.8 మి.మీ. వర్షపాతం



సముద్రాన్ని తలపిస్తున్న వంగిపురంలోని పంట పొలాలు

కొరిటిపాడు(గుంటూరు): జిల్లావ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.సోమ, మంగళవారాల్లో కూడా వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నగరంలోని నీట మునిగిన లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల్ని అప్రమత్తం చేశారు.

సోమ, మంగళవారాల్లోనూ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమైన వాన శనివారం అర్ధరాత్రి వరకూ పడుతూనే ఉంది. ఆదివారం ఉదయం కొంతమేర తెరపి ఇచ్చినప్పటికీ తిరిగి సాయంత్రం నుంచి జల్లులతో వర్షం పడుతూనే ఉంది. సోమ, మంగళవారాల్లో సైతం వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది.



సీతానగరం వద్ద కృష్ణా నది పక్కన రేవులో నిలిపివేసిన పడవలు

గుంటూరులో పలు కాలనీలు జలమయం

వర్షం కారణంగా గుంటూరులో పలు కాలనీలు, రోడ్లు జలమయమయ్యాయి. కలెక్టర్ నాగలక్ష్మి తీర ప్రాంతాల్లోని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు పునరావాసం కల్పించేందుకు తుఫాను షెల్టర్లను అందుబాటులోకి తీసుకువచ్చి అక్కడకు తరలించారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, మత్స్యశాఖ, ఆర్ అండ్ బీ, విద్యుత్, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు, చలి గాలుల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే 0863-2234014, 9849904013 టోల్ ఫ్రీ నెంబర్లుకు చేయాలని అధికారులు సూచించారు.

ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ నసీర్ ఆదివారం వినోభానగర్, పాతగుంటూరు, ఆనందపేట, సంగడిగుంట తదితర ప్రాంతాల్లో ప్రాంతాల్లో పర్యటించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులతో సమీక్ష నిర్వహించారు.

నులకపేటలో మంత్రి లోకేష్ పర్యటన

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తాడేపల్లిలోని నులకపేట ప్రాంతాన్ని పరిశీలించారు. ముంపునకు గురైన ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. మంగళగిరి రత్నాల చెరువులో తడిసిన మగ్గాలను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నేత గంజి చిరంజీవి పరిశీలించారు.

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు తూర్పులో 256 మి.మీ. అత్యల్పంగా పొన్నూరు మండలంలో 70.2 మి.మీ. వర్షం పడింది. సగటున 155.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. వపెదకాకాని మండలంలో 253.8 మి.మీ, తాడికొండ 230.4, చేబ్రోలు 229.4, గుంటూరు పశ్చిమ 225.4, తుళ్లూరు 190.4, తెనాలి 178.2, మంగళగిరి 173.2, తాడేపల్లి 128.6, కాకుమాను 128.4, వట్టిచెరుకూరు 121.6, దుగ్గిరాల 117.8, పెదనందిపాడు 112, కొల్లిపర 106.6, ఫిరంగిపురం 95.8, మేడికొండూరు 93, ప్రత్తిపాడు మండలంలో 92.8 మి.మీ. చొప్పున వర్షం పడింది.



రత్నాల చెరువులో తడిసిన మగ్గాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు , చిరంజీవి

కొట్టుకొచ్చిన శవం

తాడికొండ మండలం దామరపల్లిలో గుర్తు తెలియని యువకుడి శవం బయటపడింది. వరద నీటిలో పడి కొట్టుకొచ్చినట్లు గుర్తించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. వరద ఉధృతి పెరగడంతో ఏపీ రాజధాని అమరావతికి రాకపోకలు నిలిచిపోయాయి. బస్సులు వెళ్లే పరిస్థితి లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎస్ఆర్ఎం, విట్ యూనివర్సిటీలతో పాటు ప్రభుత్వ భవనాల చుట్టూ వరద నీరు చేరింది, పెదపరిమి-నీరుకొండ మధ్య పూర్తిగా పంట పొలాలు నీట మునిగాయి. ఇంతటితో వర్షం ఆగకపోతే మినుము, పెసర, శనగ, కూరగాయలు పంటలతో పాటు పండ్ల తోటలు దెబ్బతినే ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.





గుంటూరులోని ముత్యాలరెడ్డినగర్‌లో తడిసిపోయిన సోఫాలు, దుస్తులు, స్కూటీలో చేరిన నీరు



శేకూరు గ్రామ సమీపంలో సముద్రాన్ని తలపిస్తున్న పొలాలు



కృష్ణా నది కరకట్ట దిగువన నీట మునిగిన పసుపు

కొంప ముంచిన కన్‌స్ట్రక్షన్ కంపెనీలు

- పంట కాలువలు, డ్రెయిన్లు మూసి నిర్మాణం
- టోల్‌గేట్‌ను ముంచిన వరద నీరు

మంగళగిరి: ఎన్నడూ లేని విధంగా నగర పరిధిలోని కాజ టోల్‌గేట్ వద్ద రోడ్డుపైకి నీరు చేరడం విశేషం. టోల్ గేట్ నిర్మాణం అనంతరం చుట్టుపక్కల భూములన్నీ కన్‌స్ట్రక్షన్ కంపెనీల పరం అయ్యాయి. వందల ఎకరాలు వ్యవసాయ భూములు కొనుగోలు చేసి, పంట కాలువలు, డ్రెయిన్లు మూసేశాయి. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపైకి నీరు చేరుతోంది. టోల్‌గేట్ వద్ద పడమర వైపు పొలాల నుంచి వచ్చే వరద నీరు పంట కాలువలు , డ్రెయిన్లు ద్వారా తూర్పునకు వెళ్లి కాలువలో కలుస్తుంది. టోల్‌గేట్ ఆనుకుని ఉన్న భూముల్ని ఓ బడా రియల్ ఎస్టేట్ కొనుగోలు చేసింది. రెండు వందల ఎకరాలకుపైగా భూముల్లో పంట కాలువలు , డ్రెయిన్లు మూసేయడంతో టోల్‌గేట్ వద్ద రోడ్డుపైకి నీరు చేరింది. సమీప పొలాల్లోకి భారీగా వరద నీరు చేరింది. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ పంట కాలువలు, డ్రెయిన్లు మూసినా పట్టించుకోకపోవడంపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రామకృష్ణా వెనుజులా వద్ద వరద నీరు

జల దిగ్బంధంలో గుంటూరు బస్టాండ్



వర్షపు నీటిలో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్

- డీజిల్ కొట్టేందుకు కూడా వీల్లేని పరిస్థితి
- బయట బంకుల్లోనే ఇంధనం నింపుతున్న అధికారులు
- ఆదివారం కూడా 30శాతం కదలని బస్సులు

పట్నంబజారు: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు రెండో రోజు ఆదివారం డిపోలకే పరిమితమైయ్యాయి. ఆవరణలోనూ మోకాళ్ల లోతు నీళ్లు నిలిచాయి. గుంటూరు రీజియన్ పరిధిలో 125కుపైగా బస్సులు నిలిచిపోయినట్లు అధికారులు వెల్లడించారు. గ్యారేజీల్లోనే పలు వర్షపు నీటిలో చిక్కుపోవడం, మరమ్మతులకు గురికావడంతో 30శాతం పైగా బస్సులు గుంటూరు డిపో 1, 2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోలకే పరిమితమయ్యాయని అధికారులు తెలిపారు. గ్యారేజీల్లో డీజిల్ నింపేందుకు కూడా అవకాశం లేకుండాపోవడంతో బయట బంకుల్లో కొట్టించి పలు బస్సులను అధికారులు నడుపుతున్నారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఐదు హెవీ మోటార్లతో నీటిని తోడి బయటకు పంపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతర డిపోల్లో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది.

వరద బాధితులకు ప్రభుత్వం అండ

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



స్థానికులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

నెహ్రూనగర్: వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలో ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల్ని ఆదివారం నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహ్మద్ నసీర్ అహ్మద్‌తో కలసి పరిశీలించారు. పాత గుంటూరులోని ఎల్బీ నగర్, ప్రగతి నగర్, సుద్దపల్లి డొంక, జూన్ షాహెద్ ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యల్ని తెలుసుకున్నారు. వరద బాధితులకు సహాయ, సహకారాలు పూర్తిస్థాయిలో అందిస్తామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నీటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి మున్సిపల్ అధికారుల్ని ఆదేశించారు. గత 50 సంవత్సరాల్లో లేని విధంగా శనివారం భారీ వర్షం కురిసిందని, డ్రెయిన్ల ఔట్‌లెట్స్ సరిపోక లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయని తెలిపారు. ముంపునకు గురైన ప్రాంతాల నుంచి 1200 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి భోజనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనధికార లేఅవుట్‌లో ఉన్న ప్రగతి నగర్‌లో వసతులు కల్పిస్తామని చెప్పారు. కుళాయి కనెక్షన్లతో పాటు ఇంటి పన్నులు కట్టించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈ కోటేశ్వరరావు, ఎంహెచ్‌ఓ మధుసూదన్, డీసీపీ శ్రీనివాస్, తహసీల్దారు నగేష్, కార్పొరేటర్లు మహమూద్, చిష్టి, మీరావలి, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 41 వేల హెక్టార్లలో వరి మునక

- జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు
- చేలల్లోని నీరు బయటకు వెళ్లేలా చూసుకోవాలి
- వెంటనే తగిన మోతాదులో ఎరువులు వాడాలి



నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

తెనాలి: మాగాణి పొలాల రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదనీ, వర్షం వెలిసినందున తక్షణం పంట పొలాల్లోని వర్షపు నీరు బయటకు వెళ్లేలా చూసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక వ్యవసాయ అధికారులతో కలసి ఆదివారం తెనాలి నియోజకవర్గంలో వర్షాలకు నీటి మునిగిన వరి పొలాల్ని ఆయన పరిశీలించారు. రైతుల్ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. గుంటూరు జిల్లాలో రెండు రోజుల్లో అసాధారణంగా 240 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. డ్రెయిన్లు సరిగా లేకపోవడంతో నీరంతా పంట పొలాల్ని ముంచెత్తిందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో 41 వేల హెక్టార్లలో వరి పొలాలు నీట మునిగాయని అంచనాగా చెప్పారు. వర్షాల కారణంగా పంట కాల్వలకు నీటి సరఫరాను తగ్గించాలనీ, డ్రెయిన్లలో అడ్డంకులను తొలగించాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. నిన్నటితో పోల్చుకుంటే ఈరోజు వర్షం తగ్గినందున రైతులు కంగారుపడొద్దని సూచించారు. వరి పైరు నీటిలో పెరిగేది అయినందున 3-4 రోజులు నీరున్నా ఫర్వాలేదని తెలిపారు. మొనల వరకు మునిగివున్న చేలల్లోనే ఇబ్బంది ఉంటుందన్నారు. నీటిలో ఉన్నా పైరు కనిపిస్తుంటే, తనంత తానే ఎదుగుతుందని చెప్పారు. చేలల్లోని వర్షపునీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు వెళ్లేలా చూసుకోవాలని రైతులకు సలహానిచ్చారు. నీరు బయటకు వెళ్లిన వెంటనే 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ చల్లుకుంటే మంచిదని, కొత్త వేరు రావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. డైథేనియం 45, బావిస్టిన్ కలిపి పైపాటుగా పిచికారీ చేసినట్టయితే పంట కోలుకునే అవకాశం ఉంటుందని వెంకటేశ్వర్లు వివరించారు. వీరితో వ్యవసాయశాఖ ఏడీఏ ఉషారాణి, ఏవో ప్రేమ్‌సాగర్, రైతులు ఉన్నారు.

కొల్లిపరలో..

మండలంలోని దంతలూరు, వల్లభాపురం, అత్తోట గ్రామాల్లో ఆదివారం స్థానిక వ్యవసాయాధికారులతో కలసి జిల్లా వ్యవసాయాధికారి ఎన్. వెంకటేశ్వర్లు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట పొలాల్లో ఉన్న వర్షం నీటిని బయటకు పంపేలా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

యూపీఎస్‌ను అంగీకరించే ప్రసక్తే లేదు



గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)కు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు పేర్కొన్నారు. యూపీఎస్‌ను మన రాష్ట్రంలో అమలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. యూపీఎస్‌కు అమలు నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఆదివారం గుంటూరు పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గుంటూరు జోన్ కన్వీనర్ పి.నాగశివన్నారాయణ అధ్యక్షతన జరిగిన ప్రదర్శనలో బసవలింగారావు మాట్లాడారు. ఉద్యోగ విరమణ అనంతరం భవిష్యత్తుకు భద్రత, గ్యారంటీ లేని దుర్మార్గపు యూపీఎస్‌ను తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ అమలు చేయకపోతే పెద్ద ఎత్తున అన్ని సంఘాల్ని కలుపుకుని ఉద్యమిస్తామని తెలిపారు. అఖిల భారత పెన్షనర్స్ సంఘం నాయకుడు పి.నాగరాజు మాట్లాడుతూ ఏడాది కిందటే యూపీఎస్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకించారని తెలిపారు. అనంతరం లాడ్జి సెంటర్లలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి ఓపీఎస్ అమలు చేయాలని నినాదాలు చేశారు. ప్రదర్శనలో ఏపీ ఎన్జీవో నాయకుడు ఎం.ఎస్. మూర్తి, ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, పి. పార్వతి, కె.రమేష్, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎస్.ఎన్. మూర్తి, జి.దాస్, చక్కా వెంకటేశ్వర్లు, పి.శ్రీను, సీనియర్ నాయకులు కిశోర్, శివరామకృష్ణ, బాలరాజు, కోటేశ్వరరావు, సుబ్బారావు, గురుమూర్తి, సిద్దిక్, రామారావు, అప్పారావు, జహంగీర్, కిరణ్, వీరేశ్వరావు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య



ప్రత్తిపాడు: కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ప్రత్తిపాడు మండలం చిన కోండ్రుపాడు గ్రామానికి చెందిన శ్రీ దుర్గ (24)కు 2018లో అదే గ్రామానికి చెందిన కన్నా శ్రీనివాసరావుతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే కొన్ని నెలలుగా శ్రీదుర్గ తీవ్రమైన కడుపునొప్పితో భాధపడుతూ గుంటూరులోని ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతోంది. అయినప్పటికీ తగ్గకపోవడంతో జీవితం మీద విరక్తి చెందింది. గత నెల 31వ తేదీ రాత్రి ఇంట్లో చీరతో సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు మృతురాలి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండవీటి వాగుకు తగ్గని వరద

- ముంపు ముంగిట్లో పంట పొలాలు, రాజధాని రహదారులు
- ప్రజల తరలింపునకు రంగంలోకి దిగిన జిల్లా ఎస్పీ, రెవెన్యూ యంత్రాంగం
- బిక్కుబిక్కుమంటున్న లంక గ్రామాల ప్రజలు



లంక గ్రామాలకు వెళ్లేందుకు బోటును సిద్ధం చేసి సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



లంక గ్రామాల్లో పర్యటిస్తున్న తుళ్లూరు తహసీల్దార్ సుజాత

తాడికొండ: వర్షం తగ్గుముఖం పట్టినా కొండవీటి వాగుకు వరద ఉధృతి ఏమాత్రం తగ్గకపోవడంతో వాగులు, వంకలు ఏరులై పారుతున్నాయి. తాడికొండ, తుళ్లూరు, మండలాల్లో పంట పొలాలు, రాజధాని రహదారులు పూర్తిగా నీటమునిగాయి. కొండవీటి వాగుకు వచ్చిన వరదకు తాడికొండ, తుళ్లూరు మండలాల్లో దాదాపు 30 వేల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగి రైతులకు తీరని నష్టం జరిగింది. నీరుకొండ వద్ద భారీగా వరద నీరు చుట్టుముట్టడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, రెవెన్యూ యంత్రాంగం సాయంతో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి పెదలంక గ్రామానికి వెళ్లి రెస్క్యూ ఆపరేషన్ చేసి వరద బాధితులను బయటకు తీసుకొచ్చారు. అయితే వారి పశువులు మాత్రం వరద నీటిలోనే ఉండటంతో ఏం చేయాలో పాలుపోక వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పెరుగుతున్న వరద ఉధృతితో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. పునరావాస కేంద్రాలకు తరలించి తమకు మెరుగైన వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.
- శనివారం వాగుల ఉధృతికి ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. డ్రైవర్లు, కండక్టర్లు బస్సులలోనే నిద్రించి ఆదివారం వాగు తగ్గుముఖం పట్టిన తరువాత డిపోకు వెళ్లిపోయారు.
- అమరావతి గుంటూరు ప్రధాన రహదారిపై చింతచెట్టు కుప్పకూలి రోడ్డుకు అడ్డంగా పడింది. వాహనదారులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.
- తుళ్లూరు మండలం హరిశ్చంద్రపురం, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెం గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి లంక గ్రామాల బాధితులను పాఠశాలల్లోకి తరలించారు. మూడు పునరావాస కేంద్రాలలో ఇప్పటి వరకు 316 మంది వరద బాధితులు బస చేస్తున్నారు.
- తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన పగడాల రాఘవ (39) వరద నీటిలో కొట్టుకుపోయి మృత్యువాత పడ్డాడు. గుంటూరులోని ప్రసన్నాంజనేయ హాస్టల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్న యువకుడు కొండవీటి వాగు పొంగిపొర్లడంతో శనివారం రాత్రి ఇంటికి వచ్చేందుకు దారిలేక లాం- దామరపల్లి మీదుగా పొన్నెకల్లు వచ్చేందుకు యత్నించగా అర్ధరాత్రి వరద నీటిలో కొట్టుకుపోయి మృత్యువాత పడ్డాడు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి ఇద్దరు మగ పిల్లలు 9–10 తరగతులు చదువుతున్నారు.
- లింగాయపాలెం, తాళ్లాయపాలెం గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ వరద బాధితులకు ఓ పది నిముషాలు కనిపించి వెళ్లిపోయారని, ఎలాంటి సహాయక చర్యలు చేయలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహానాడును ముంచెత్తిన వరద

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి మహానాడులో ఆదివారం రాత్రి నివాసాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. సీతానగరం పుష్కర ఘాట్లు దాటిన తరువాత రైల్వే బ్రిడ్జి నుంచి మసీదు వరకు పూర్తిగా నీట మునిగింది. కార్పొరేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖలు ప్రజల్ని ఇళ్ల నుంచి ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. 2008 తరువాత ఈ ప్రాంతంలోకి వరదనీరు రావడం మొదటి సారి. మరో లక్ష క్యూసెక్కుల వరద నీరు పెరిగితే మణిపాల్ హాస్పిటల్ కరకట్ట రోడ్డు వద్దకు వరదనీరు వచ్చి చేరుతుంది. సుమారు వెయ్యికి పైగా నివాసాలు నీట మునుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రెండు రోడ్లలో వరద నీరు రావడంతో కృష్ణానది వైపు వున్న నివాసాలు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాసాల్లోని వరద నీరు వచ్చింది. రెండు చోట్ల గోడలు కూలాయి. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, తాడేపల్లి తహసీల్దార్ సతీష్‌కుమార్, తాడేపల్లి, మంగళగిరి టౌన్ సీఐలు కళ్యాణ్ రాజు, వినోద్ కుమార్ అధికారులతో కలసి వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు.



రాకపోకలు నిలిచిపోవడంతో ఆదివారం ఉదయం తాడికొండలో నిలిచిన ఆర్టీసీ బస్సులు



అమరావతి- గుంటూరు ప్రధాన రహదారిపై ఈదురు గాలులకు నేలకూలిన చింతచెట్టు



లాం కొండవీటి వాగుపై పునరుద్ధరించిన వాహన రాకపోకలు

వారంలోగా వసతి గృహంలో వసతుల కల్పన



గురుకుల విద్యార్థినులతో మంత్రి నాదెండ్ల మనోహర్

మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి: పట్టణ ఆర్ఆర్ నగర్‌లోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గిరిజన గురుకుల వసతి గృహ విద్యార్థినులకు వారం రోజుల పాటు ఆహార వసతులు కల్పిస్తామని, ఆరోగ్య సమస్యలు రాకుండా చూసుకుంటామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీనిచ్చారు. వర్షాలు తగ్గాక, వారం రోజుల్లో వసతి గృహానికి అవసరమైన పనుల్ని చేపడతామని చెప్పారు. భారీ వర్షాల కారణంగా వసతి గృహంలోకి నీరు చొచ్చుకురావడంతో గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు 114 మందిని సమీపంలోని చంద్రబాబునాయుడు కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు తరలించిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం మంత్రి మనోహర్ పాఠశాలకు వెళ్లి, విద్యార్థినులను పరామర్శించారు. బిస్కట్లు, కేక్‌లు తెప్పించి ఇచ్చారు. అక్కడ వసతుల గురించి ఆరా తీశారు. విద్యార్థినులకు భోజనం తయారుచేస్తున్న వంటగదిలోకి వెళ్లి, కూరగాయలు, ఆకుకూరలను పరిశీలించారు. అవి సరిపోవని, బంగాళాదుంపలు వంటి పౌష్టికాహారం కలిగిన కూరగాయలను తెప్పించమని ఆదేశించారు. అవసరమైన నగదును సమకూర్చాల్సిందిగా మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. వంట గదిలోని సరకులను పరిశీలించారు. ఉప్పు ప్యాకెట్‌ను మూడు నెలల్లో వినియోగించాల్సి ఉండగా, సమయం అయిపోయినట్టు గమనించారు. సెల్‌ఫోన్‌తో ఫొటో తీసుకున్నారు. వసతిగృహంలో సరుకులను తనిఖీ చేయాలని లీగల్ మెట్రాలజీ అధికారులను ఆదేశించారు. చంద్రబాబు నాయుడు కాలనీ ప్రజల వినతిమేరకు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. వర్షపునీరు చుట్టుముట్టిన రాజీవ్ గృహకల్ప భవన సముదాయాన్ని పరిశీలించారు. మధ్యలో రేషను బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేశారు. పంచదార ప్యాకెట్లను గమనించి, డ్యామేజీ ఉన్నవి పంపిణీ చేయొద్దని ఆదేశించారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు?

- గుంటూరు నగరంలోని ఓ వసతి గృహంలో ఘటన
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో వెలుగులోకి
- విచారిస్తున్న పోలీసులు

పట్నంబజారు: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఒక సాంఘిక సంక్షేమ వసతి గృహంలో తొమ్మిదో తరగతి అభ్యసిస్తున్న విద్యార్థినులపై పలువురు యువకులు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి హాస్టల్‌లోనే విధులు నిర్వహిస్తున్న ఒక ఉద్యోగి పూర్తిస్థాయిలో యువకులకు సహకరించినట్లు తెలుస్తోంది. విద్యార్థినులు వారి తల్లిదండ్రులకు జరిగిన ఘటనపై సమాచారం తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. విద్యార్థినుల తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ, నగరంపాలెం సీఐ, స్టేషన్ సిబ్బంది విచారిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి వరకు విచారణ కొనసాగుతూనే ఉంది. అయితే తొమ్మిదో తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలపై లైంగిక వేధింపులు జరిగినట్లు సమాచారం. బాలికలను భయపెట్టి సదరు ఉద్యోగి యువకులకు సహకరించాలని ఇబ్బందులకు గురి చేసినట్లు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో అసలు ఘటన బయటకు రాకుండా తల్లిదండ్రులతో ఇప్పటికే హాస్టల్ అధికారులు మంతనాలు జరుపుతున్నారని సమాచారం. ఈ ఘటన విద్యార్థినుల తల్లిదండ్రులు ఎంతో ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి విచారిస్తున్నట్లు వెస్ట్ సబ్‌డివిజన్ అధికారి తెలిపారు. విద్యార్థినుల నుంచి ఫిర్యాదు తీసుకున్న అనంతరం విచారించి పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో మేధకు పదును

కేఎల్ వర్సిటీ బేసిక్ ఫౌండేషన్ ప్రొఫెసర్ పార్థసారథి



ప్రాజెక్టులను తిలకిస్తున్న ప్రొఫెసర్ పార్థసారథి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో విద్యార్థుల్లో మేధకు పదును పెట్టవచ్చని కేఎల్ యూనివర్సిటీ బేసిక్ ఫౌండేషన్ ప్రొఫెసర్ పి.పార్థసారథి అన్నారు. ఆదివారం అమరావతి రోడ్డులో యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థమెటిక్ సిస్టం(యూసీ మాస్) విద్యార్థులు మెదళ్లకు పదును పెట్టి తయారుచేసిన రోబోటిక్స్ చంద్రయాన్, అగ్రికల్చర్ రోబో, సెల్ఫ్ డ్రైవింగ్ కార్, స్మార్ట్ విలేజ్, కేరమ్ రోబోట్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్థసారథి మాట్లాడుతూ చిన్న వయసులోనే రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అబాకస్ వంటి సాంకేతిక విద్యను విద్యార్థులకు నేర్పించడం ద్వారా భవిష్యత్ మేధో సంపన్న శాస్త్రవేత్తలుగా రాణిస్తారని తెలిపారు. శ్రీ రైనా టెక్నాలజీస్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల చైర్మన్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచం భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాలతోనే ముడిపడి ఉందని చెప్పారు. యూసీ మాస్ శిక్షణ ద్వారా ఆరేళ్ల వయసు నుంచి 18 ఏళ్ల విద్యార్థుల వరకు రోబోట్ మోడల్స్‌పై కోడింగ్ ప్రోగ్రాంలలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. రోబోటిక్స్, గణితంలో అబాకస్ మూడు సంవత్సరాల శిక్షణల ద్వారా ప్రత్యేక గ్రాడ్యుయేషన్ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. వీవీఐటీ ప్రొఫెసర్ డీవీ శేషగిరిరావు, పీపుల్స్ ట్రామా వైద్య నిపుణుడు కె.వెంకటేశ్వరరెడ్డి, విశ్రాంత ఎంఈఓ ఓవీ రామిరెడ్డి ప్రాజెక్టులను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో యూసీ మాస్ ప్రతినిధి ఎం.శ్రీకాంత్, టెక్నికల్ మోడరేటర్స్ రమ, పూజ, నందిని, మహాలక్ష్మి, లీలామణి, జ్యోత్స్న జ్యోతి, జీవన పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ డీడీపై చర్యలు తీసుకోవాలి

లక్ష్మీపురం: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా సోషల్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావుపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ ప్రభుత్వాన్ని కోరారు. సంబంధిత శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు.మధుసూదనరావుపై గతంలో కూడా ఏసీబీ కేసు నమోదు చేసినట్లు గుర్తు చేశారు. కేసు ముగిసే వరకు ప్రధాన బాధ్యతలు ఇవ్వకూడదని నిబంధన ఉన్నా కూడా ఆనాడు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌తో మాట్లాడుకొని సోషల్ వెల్ఫేర్‌తో పాటు బీసీ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల ఇన్‌చార్జిల బాధ్యతలు తీసుకున్నారని తెలిపారు. నెలలో కనీసం డీడీ 20 హాస్టల్స్ పర్యవేక్షించి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలని ఆదేశాలు ఉన్నా ఇప్పుడు వరకు ఎన్ని పర్యవేక్షించారని ప్రశ్నించారు. జిల్లా కార్యాలయంలో వారంలో రెండు రోజులు కూడా ఉండరని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీలో పెద్ద అవినీతి జరిగిందని ఆరోపించారు.

వరద బాధితులను ఆదుకోవాలి



నంబూరులో పర్యటిస్తున్న రామారావు తదితరులు

లక్ష్మీపురం: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. ఆదివారం సీపీఎం ప్రతినిధి బృందం పెదకాకాని, మంగళగిరి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించింది. నీట మునిగిన పొలాలు, నివాస ప్రాంతాల్ని నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అధిక వర్షాలకు పంట కాల్వలు, చెరువులు తెగిపోయి నీరంతా పొలాలపై ప్రవహిస్తోందన్నారు. వరి పంట పూర్తిగా మునిగిపోయిందని తెలిపారు. ఇప్పటికే ఎకరానికి వరి పంటకు రూ. 30వేలు దాకా రైతులు ఖర్చు చేశారని ఆయన తెలిపారు. వ్యవసాయ శాఖ వెంటనే పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. పెదకాకానిలోని సుందరయ్య నగర్, కాజ గ్రామంలోని పుల్లయ్య నగర్ పూర్తిగా నీటిలో మునిగిపోయి పలువురు సహాయ శిబిరాలలో ఉన్నారని, వారికి సరైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ, ఈమని అప్పారావు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఆట ముగిసింది... శ్వాస ఆగింది

స్టేడియంలోనే కుప్పకూలిన షటిల్ ప్లేయర్



వెంకట రాంబాబు(ఫైల్)

తెనాలి రూరల్: చివరి నిమిషం వరకూ ఆడుతూనే ఉండాలి.. ఆడుతూనే శ్వాస ముగించాలి అని పలుమార్లు సహచర క్రీడాకారులతో పదే పదే చెప్పేవారు ఆయన. అలాగే ఆట ముగిసింది. అదే క్షణంలో శ్వాస ఆగింది. అప్పటి వరకూ ఆటలో పోటీ పడిన ఆయన అదే స్టేడియంలో తుది శ్వాస విడిచారు. తోటి క్రీడాకారులు, కుటుంబ సభ్యులను శోక సంద్రంలో ముంచిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పోచిరాజు వెంకట రాంబాబు వివరాలిలా ఉన్నాయి. రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన పోచిరాజు వెంకట రాంబాబు(56) మంచి క్రీడాకారుడు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ అంటే అతనికి ప్రాణం. ట్యూషన్ టీచర్‌గా గ్రామంలో జీవితాన్ని ప్రారంభించిన ఆయన తెనాలి వహాబ్ రోడ్డులోని సంస్కార్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా సుదీర్ఘకాలం పనిచేశారు. కాలక్రమంలో పౌరోహిత్యం నేర్చుకుని పురోహితునిగా జీవనం సాగిస్తున్నారు. కొలకలూరులోని కొత్త ఐజక్ శ్యామ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్(కిస్బా) ఉపాధ్యక్షులుగా ఉన్న ఆయన ప్రతి రోజు ఉదయం షటిల్ బ్యాడ్మింటన్ ఆడటం అతని దినచర్యలో భాగం. ఆ క్రమంలో వర్షం కారణంగా కిస్బా కోర్టు జలమయం కావడంతో తెనాలి ఇండోర్ స్టేడియానికి వెళ్లారు. అక్కడ డబుల్స్ గేమ్ ప్రత్యర్థులతో పోటీ పడ్డాడు. ఇరు జట్లు చెరో సెట్ గెలవగా మూడో సెట్‌లో పోటీ పడ్డారు. ఆట ముగిసింది. రెండు జట్లు కోర్టు నుంచి అడుగు బయట పెడుతుండగానే రాంబాబు కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న తోటి క్రీడాకారులు సపర్యలు చేశారు. క్షణాల్లో కూతవేటు దూరంలో ఉన్న తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించడంతో క్రీడాకారులంతా కన్నీటి పర్యంతరమయ్యారు. అప్పటి వరకూ తమతో చలాకీగా ఆడిన మిత్రుడు విగతజీవిగా మారటాన్ని వారు జీర్ణించుకోలేకపో యారు. కుటుంబసభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఆయన మృతికి కిస్బా అధ్యక్ష కార్యదర్శులు టి.రవీంద్రబాబు, ఎస్. వినయకుమార్, సభ్యులు కె. జార్జిథామస్, ఎస్కే కరీముల్లా, కె. కిరణ్మయి, ఎస్. మురళీధర్, పి.సురేష్ బాబు, కె. శ్రీకాంత్, వసంతరావు, సీహెచ్ నాగరాజు, సత్యనారాయణ, శివ సంతాపం వ్యక్తం చేశారు. వెంకటరాంబాబుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: జిల్లాలో తుపాన్, వరద , ప్రకృతి వైపరీత్యాల వల్ల డయేరియా, డెంగీ మలేరియా వ్యాధులు ప్రభలే అవకాశముందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాధుల బారిన పడకుండా ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, క్లోరిన్ కలిపిన నీటిని మాత్రమే తాగటానికి ఉపయోగించాలని చెప్పారు. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత సబ్బును ఉపయోగించి చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈగలు వాలిన ఆహార పదార్థాలు, చెడిపోయిన ఆహార పదార్థాలు, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, పానీయాలు, చెడిపోయిన కూరగాయలు, పండ్లు, చేపలు, మాంసం తినకూడదన్నారు. మలవిసర్జనకు తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్లు లేదా సామాజిక మరుగుదొడ్లు మాత్రమే వినియోగించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో చెడిపోయిన ఆహార పదార్థాలు, చెత్త చెదారాన్ని పార వేయకూడదన్నారు. అప్పుడే వండిన ఆహార పదార్థాల్ని, తాజా ఆహారాన్ని మాత్రమే భుజించాలన్నారు. వండిన ఆహార పదార్థాలపై, మంచి నీటి పైన మూతలు తప్పనిసరిగా ఉపయోగించాలని తెలిపారు. ఇంటి లోపల ఇంటి బయట పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఎవరైనా అనారోగ్యాన్ని గురైతే సమీపంలోని వైద్య ఆరోగ్య సిబ్బందిని, ప్రాథమిక ఆసుపత్రి, పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సహాయాన్ని పొందాలన్నారు.

హెల్ప్‌లైన్ ఏర్పాటు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ గుంటూరు కార్యాలయంలో అత్యవసర సహాయం నిమిత్తం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు భయభ్రాంతులకు గురి కాకుండా అందుబాటులో ఉన్న వైద్య ఆరోగ్య సేవలను వినియోగించు కోవాలని కోరారు.

అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు

శ్రీనివాసరావు -9866738092.
ఆదిల్ బాషా 7893310128.
గురవయ్య - 9030235892.
కంట్రోల్ రూమ్ నెంబర్: 8341396104.

కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



పట్నంబజారు: మురుగు కాలువలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఆగస్టు 31వ తేదీ రాత్రి భారీ వర్షం నేపథ్యంలో గుర్తుతెలియని సుమారు 50 సంవత్సరాల వ్యక్తి మురుగు కాలవలో పడి మృతి చెందాడు. చుట్టుపక్కల అడిగినప్పటికీ ఎటువంటి ప్రతిఫలం కనబడలేదు. ఈ మేర కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం మార్చురికి తరలించారు. మృతుడు వివరాలు తెలిసినవారు 8688831325కు సమాచారాన్ని అందించాలని తెలిపారు.